# పందెంకోడి

-డి.సదాశివ

"రెండువందల సంవత్సరాల పరాయి దేశ పాలన నుండి మన దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గాంధీ మహాత్ముడి పుట్టినరోజుని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. పుట్టుకతో ఏ మనిషీ నేరస్థుడు కాదు. క్షణికావేశంలో వివేకం కోల్పోయి మనిషి చేసే తప్పులే అతనిని నేరస్థుడిని చేస్తాయి. చేసిన తప్పును తెలుసుకుని పరివర్తన చెంది తిరిగి ఆ తప్పుని చేయని మనిషి సమాజం చేత గౌరవింపబడతాడు. పరివర్తన చెందిన మీరందరూ కూడా రాబోయే కాలంలో తిరిగి సమాజంలో కలసి బాధ్యత కలిగిన పౌరులుగా దేశాభివృద్ధికి పాటు పడతారని ఆశిస్తున్నాను" గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర కారాగారంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తున్న జిల్లా న్యాయమూర్తి గారు ఒక క్షణం ఆగారు.

ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న సుబ్బన్న తోటి ఖైదీ శంకరయ్య మాటలకు పక్కకి చూసాడు.

"పదేళ్లుగా ప్రతిసారీ ఈ మాటలేకదన్నా మనం వినేది. మన రిలీజ్ గురించి ఏమీ చెప్పడేమన్నా?" చిరాగ్గా మొహం పెట్టి నసిగాడు శంకరయ్య.

జడ్జిగారి ఉపన్యాసం మళ్లీ అందుకున్నారు.

"ఈనాడు ప్రపంచంలో ఎక్కడ చూసినా హింస, ఉగ్రవాదం పెట్రేగిపోతున్నాయి. ప్రపంచ శాంతికి, మనిషి ప్రశాంత మనుగడకి మహాత్ముడు చూపిన మార్గం, ఆయన సందేశం ఈనాడు ప్రపంచానికి ఎంతైనా అవసరం, అనుసరణీయం" జడ్జిగారు ఒక నిముషం ఆగారు.

పక్కనే కూర్చున్న జైలు సూపరింటెండెంట్ గారు లేచి జడ్జిగారి చెవిలో ఏదో గొణిగాడు.

జిల్లా జడ్జిగారు గొంతు సవరించుకుని "మీ అందరికీ ఓ శుభవార్త. గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. దానికి సంబంధించిన ఉత్తర్వులు జైలు అధికారులకు ఈరోజే చేరాయి. వాటిని పరిశీలించి అర్హత సాధించిన ఖైదీలందరినీ రేపు ఉదయం విడుదల చేస్తామని సూపరింటెండెంట్‌గారు ఇప్పుడే చెప్పారు" అని అంటూనే ఆ ప్రదేశమంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

★★★

మర్నాడు ఉదయం పదిగంటల సమయం.

కేంద్ర కారాగారం బయట చాలా హడావుడిగా ఉంది. విడుదల అయ్యే ఖైదీలకోసం వచ్చిన బంధుమిత్రులతో, ఖైదీలను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన మీడియా, టీవీ ఛానళ్ల సిబ్బందితో చాలా సందడిగా ఉంది. మెయిన్‌గేట్ దాటి బయటకు కాలు పెట్టాడు సుబ్బన్న. ఒక టీవీ ఛానల్‌వాళ్లు గబగబా సుబ్బన్న దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

"నీ పేరు?" యాంకరు మైకు సుబ్బన్న మొహం దగ్గర పెడుతూ అడిగాడు.

"సుబ్బన్న"

"ఎన్నాళ్లు జైల్లో వున్నావు?"

"పన్నెండేళ్లు"

"నిన్ను తీసుకువెళ్లడానికి నీవాళ్లు ఎవరొచ్చారు?"

ఆ ప్రశ్నకు సుబ్బన్న తన చుట్టూ చూసాడు. తనకు పరిచయమున్న వాళ్లెవ్వరూ కనిపించలేదు."

"ఎవ్వరూ రాలేదు" అన్నాడు సుబ్బన్న.

"నీకు భార్యాపిల్లలులేరా?"

"భార్య చనిపోయింది. పిల్లవాడున్నాడు. ఇప్పుడెక్కడున్నాడో తెలియదు" నిర్వేదంగా పలికాడు సుబ్బన్న.

మరో ఖైదీ విడుదల అయి గేటు బయటకొస్తూనే యాంకర్ అటువైపు వెళ్లిపోయాడు. అంతలోనే శంకరయ్య పరుగులాంటి నడకతో సుబ్బన్న దగ్గరకు వచ్చాడు.

"పదేళ్ల తరువాత బయట+కొస్తే వీళ్ల ప్రశ్నలు, గోల ఏందన్నా?" కెమెరాలతో, మైకులతో హడావుడి చేస్తున్న మీడియావాళ్లను విసుగ్గా చూస్తూ అన్నాడు శంకరయ్య.

"జైలులో జీవితం పరాయి పాలనలాంటిదన్నా. జైలు బయట జీవితం స్వంత పాలనన్నా. రెండింటికీ ఎంత తేడా. పదన్నా... ముందు మనం మందు కొట్టి పండుగ చేసుకోవాలి" అంటూ శంకరయ్య సుబ్బన్న చేయి పట్టుకుని ముందుకు లాగాడు.

"ముందు సింహాచలం వెళ్లి అప్పనస్వామికి దండం పెట్టుకునిగానీ ఏమీ ముట్టుకోను" శంకరయ్య నుండి చేయి విడిపించుకుంటూ అన్నాడు సుబ్బన్న.


"రిలీజ్ అయిన తరువాత కలసి మందు కొట్టాలని ఎప్పడినుండో అనుకుంటున్నా. నా సరదా మీద చన్నీళ్లు కుమ్మరించావు అన్నా. దేవుడి పేరు చెప్పావు కాబట్టి వదిలేస్తన్నా. నీవు కేడీపేట వస్తే మాత్రం నన్ను కలవడం మరచిపోవద్దు. బస్టాండ్ దగ్గరకొచ్చి మస్తాన్ టీకొట్టులో

నా పేరు చెబితే చాలు. నేను కాకిలా వాలిపోతా. మరి వస్తా అన్నా'' అంటూ హుషారుగా ఈల వేసుకుంటూ బస్టాప్ వైపు నడిచాడు శంకరయ్య.

***

సుబ్బన్న సింహాచలం వెళ్లి దైవదర్శనం చేసుకుని కొండ దిగి హోటల్‌లో టిఫిన్ చేసి తన వూరెళ్లే బస్సెక్కాడు. బస్సు ముందుకు పరుగెడుతుంటే సుబ్బన్న మనసు గతంవైపు పరుగులు తీసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్లకి భూమ్మీద పడ్డాడు సుబ్బన్న. సుబ్బన్నకి ఐదేళ్లొచ్చేసరికి రాయుడిగారి పశువుల కొట్టంలో పనికి పెట్టాడు సుబ్బన్న తండ్రి. రెండు పూటలు భోజనం, సాలుకి రెండు బస్తాలు ధాన్యం జీతం. వెయ్యి గడపలున్న రామాపురం గ్రామంలో రాయుడిగారే పెద్ద రైతు.

వందెకరాల మాగాణి, పది జతల ఎడ్లు, పాతిక పాడిగేదెలు రాయుడిగారి ఇంటి వెనుక ఎకరం స్థలంలో రెండు పాకలు, మూడు గడ్డివాములు, ఐదుగురు పాలేర్లు, రాయుడిగారి ఇల్లు వచ్చిపోయేవాళ్లతో నిత్యం సందడిగా ఉండేది.



సుబ్బన్నకి పాతికేళ్ళు వచ్చేసరికి పొరుగూరి పిల్లతో పెళ్ళి జరిపించాడు తండ్రి. కొడుకు కాపురం ఆర్నెల్లు కాకుండానే సుబ్బన్న తండ్రి పైలోకాలకు వెళ్ళిపోయాడు. మరో ఆర్నెల్లకి సుబ్బన్న తండ్రయ్యాడు. తన పిల్లోడికి తండ్రి పేరు పెట్టుకున్నాడు. మనవడిని చూసుకుని మురిసిపోయింది సుబ్బన్న తల్లి. మనవడు బుడిబుడి అడుగులు వేస్తూ నడక మొదలుపెట్టేసరికి తన భర్త పిలవడంతో హడావుడిగా పైలోకాలకు వెళ్ళిపోయింది.

సుబ్బన్నకి వయసుతోపాటు రాయుడుగారి కొలువులో హోదా పెరుగుతూ వచ్చింది. నలభై ఏళ్ళు వచ్చేసరికి రాయుడుగారికి కుడిభుజంగా, తలలో నాలుకగా ఎదిగాడు సుబ్బన్న.

రామాపురం గ్రామంలో అన్ని కులాలవారు ఉన్నా రాజకీయాలకు మాత్రం వాళ్ళు అతీతంగా ఉండేవారు. అసెంబ్లీ ఎన్నికలైనా, పంచాయితీ ఎన్నికలైనా ప్రశాంతంగా జరిగిపోయేవి. పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచీ ఊరికి ప్రెసిడెంట్ భూషయ్యగారే. భూషయ్యగారు రాయుడిగారంత ఆస్థిమంతుడు కాకపోయినా వూరిలో అరవై ఎకరాల మాగాణి పొలం, పట్నంలోని రైసు మిల్లులో వాటా ఉన్నాయి.

ప్రశాంతంగా ఉన్న రామాపురం గ్రామ పంచాయితీలో ఉరుములు, మెరుపులు లేని వానలా వచ్చింది రాయుడుగారి, భూషయ్యగారి పొలాల మధ్య సరిహద్దు తగాదా. అంతే... ఊరు రెండుగా చీలిపోయింది. రాయుడుగారి వర్గం, భూషయ్యగారి వర్గం. అప్పటిదాకా కలసిమెలసి పచ్చగా ఉన్న కుటుంబాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమని అంటుకోవడం మొదలయింది. పంచాయితీ ఎన్నికలొచ్చేసరికి వూరి వాతావరణం రణరంగంలా మారిపోయింది. కారణం భూషయ్యగారికి పోటీగా రాయుడుగారు నిలబడడమే. ఇరువర్గాలు కత్తులు నూరుకున్నారు. ఎప్పుడు ఎక్కడ అవకాశమొస్తే అవతల వర్గం వాడిని నరికేడానికి చూస్తున్నారు. రాయుడుగారు, భూషయ్యగారు బ్రాందీ సీసాలకి, పలావ్ పాకెట్లకి రోజూ వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

సుబ్బన్న పక్కన లేకుండా కాలు బయటకు పెట్టడంలేదు రాయుడుగారు. వూర్లో గంగానమ్మ జాతరకి ఏటపోతుల బలికి వాడే కత్తిని సంపాదించాడు సుబ్బన్న. దానిని బాగా సాన పట్టించి దానికి సరిపడా సంచీని మస్తాన్ టైలర్ దగ్గర కుట్టించి భుజానికి తగిలించుకుని తిరుగుతున్నాడు సుబ్బన్న. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు రామాపురం ప్రజలు. ఎన్నికలు ఇంకా రెండురోజులు ఉన్నాయనగా రాయుడుగారు అర్జంట్ పనిమీద పట్నం వెళ్లారు. గబగబా పని పూర్తి చేసుకుని చీకటి పడేలోపు వూరికి చేరాలని బుల్లెట్ మోటార్ సైకిల్ అరవై కిలోమీటర్ల స్పీడుతో నడుపుతున్నాడు. వెనకాల కూర్చున్న సుబ్బన్న భుజం మీద సంచీ జారిపోకుండా జాగ్రత్తగా పట్టుకున్నాడు.

రాయుడుగారు రామాపురం శివారుకి వచ్చేసరికి సూర్యుడు పడమటి దిక్కు విశ్రాంతికి వెళ్ళిపోయాడు. రాయుడుగారి మోటార్‌సైకిల్ చింతతోపు మలుపు దగ్గరకు వచ్చేసరికి స్లో చేసాడు. మలుపు తిరుగుతూనే రోడ్డుకి అడ్డంగా తాటిచెట్టు ఉండడంతో సడెన్ బ్రేక్ వేసాడు రాయుడుగారు.

విషయం అర్థమయి రాయుడుగారు, సుబ్బన్న బండి దిగారు. సుబ్బన్న ఆలస్యం చేయకుండా వెంటనే తన భుజం మీదున్న సంచీ తీసి కత్తి చేత్తో పట్టుకున్నాడు. అప్పటిదాకా చింత చెట్టు వెనకాల నక్కిన భూషయ్యగారి మనుషులు కర్రలతో, బరిసెలతో రాయుడుగారి మీదకు దూసుకువచ్చారు. సుబ్బన్న గభాల్న రాయుడుగారి ముందుకొచ్చి దాడి చేసే వారి మీదకి కత్తిని క్రికెట్ బ్యాట్‌లాగా గట్టిగా ఊపాడు. అందరికంటే ముందుండి బరిసెతో రాయుడుగారి మీదకు దాడి చేయడానికి వస్తున్న భూషయ్యగారి పెద్ద పాలేరు సింహాచలం తల తెగి శరీరం నుండి వేరై ఇరవై గజాల దూరంలో పడింది. మొండెం నుండి రక్తం పౌంటెన్‌లా చిమ్మింది. అది చూసి అక్కడివాళ్లంతా భయంతో వణికిపోయారు. భూషయ్యగారు మనుషులు వూరివైపు పరుగెత్తుకుంటూ పోయారు. రాయుడుగారు షాక్‌తో నోట మాట రాక శిలలా నిలబడిపోయారు.

కళ్లముందు ఏం జరిగిందో అర్థమయ్యేసరికి సుబ్బన్నకి ఒళ్లంతా చెమటలు పట్టాయి. వంట్లో సన్నగా వణుకు మొదలయింది. రక్తం ఓడుతున్న కత్తి మెల్లగా చేతిలో నుండి జారి నేలమీదపడింది.


రామాపురం గ్రామం ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. ఈ హత్య జిల్లాలోనే సంచలనం కలిగించింది. సుబ్బన్నని అరెస్టు చేసి పోలీసులు కేసు దర్యాప్తు మొదలుపెట్టారు. సుబ్బన్నకి జిల్లా కోర్టులో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. హైకోర్టు కూడా క్రింద కోర్టు తీర్పుని ఖరారు చేసింది.

చిన్న కుదుపుతో బస్సు ఆగింది. సుబ్బన్న గతం నుండి వర్తమానంలోకి వచ్చాడు.



## విద్యాబాలన్ ఆశాభావం

విద్యాబాలన్ జనవరి ఒకటవ తేదీన తన 31వ ఏట అడుగుపెట్టింది. వయసు చెప్పుకోడానికి చాలామందిలా అంతగా అభ్యంతరం చెప్పని విద్య తనకి ఈ పుట్టినరోజు తర్వాత నుంచి కెరీర్ ఇంకా బాగుంటుందనే ఆశాభావంతో వున్నానంటోంది. 'పా' సినిమా తెచ్చిన మంచి పేరును అలాగే నిలబెట్టుకోవాలనుకుంటున్నానని చెప్పే విద్యాబాలన్ రాబోయే 'ఇష్కియా'తో నటిగా మరింత పేరు తెచ్చుకునేందుకు కృషి చేస్తోందిట.



"ఇదే రామాపురం జంక్షన్" తనవైపు చూస్తూ చెబుతున్న కండక్టర్‌ను చూసి గబగబా బస్సులో నుండి క్రిందకు దిగాడు. బస్సు ముందుకు కదిలింది. చుట్టూ చూసిన సుబ్బన్నకి అక్కడ తన వూరువెళ్లే కచ్చా రోడ్డు కనిపించలేదు. దాని స్థానంలో తారురోడ్డు మెరిసింది. రోడ్డుకి రెండువక్కలా రెండు చిన్న హోటల్స్ వెలిసాయి. రిక్షాలు పోయి ఆటోరిక్షాలు వచ్చాయి. సుబ్బన్న హోటల్‌లో ఒక స్ట్రాంగ్ టీ తాగాడు. రామాపురం వెళ్లడానికి ఆటో రెడీగా ఉంది. కానీ సుబ్బన్న ఆ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.పన్నెండు సంవత్సరాల తరువాత స్వంత వూరు వెళ్తున్నందుకు కొంచెం ఆనందంగా ఉంది. మనస్సులో మరో మూల కొంచెం భయంగా కూడా ఉంది ఊరి జనం తన మీద ఏ అభిప్రాయంతో ఉన్నారో అని. పచ్చటి పొలాలు, రోడ్డు పక్కనే పిల్ల కాలువ, ఆకాశంలో గూటికి చేరడానికి ఆరాటంతో ఎగురుకుంటూ పోతున్న పక్షులు. దూదిపింజల్లా తెల్లటి మబ్బులు. స్వచ్ఛమైన పైరగాలి పలకరిస్తుంటే ప్రకృతి అందాలకి పరవశిస్తూ సుబ్బన్న రామాపురం పొలిమేరలకి వచ్చేసాడు.

అక్కడనుండి కుడివైపు తిరిగి పొలాల మధ్యలోని మట్టిరోడ్డు మీదుగా వెళితే అరకిలోమీటరు దూరం తగ్గుతుంది. సుబ్బన్న తారురోడ్డు నుండి మట్టిరోడ్డులోకి నడిచాడు. ఒక ఫర్లాంగు వెళ్లేసరికి కోటేశ్వరరావు ఎదురుపడ్డాడు. కోటేశ్వరరావు సుబ్బన్నకంటే ఒక సంవత్సరం పెద్దోడు. పదవ తరగతి దాకా చదివి మిలటరీలో చేరిపోయాడు. ముప్పై సంవత్సరాలు దేశ రక్షణకై పాటుపడి రిటైర్‌మెంట్ తీసుకుని స్వంత వూరులో ప్రభుత్వం వారిచ్చిన పొలం సేద్యం చేసుకుంటూ వచ్చే పెన్షన్‌తో కాలం గడుపుతున్నాడు.

"నువ్వు సుబ్బన్నవేగా! ఈరోజు పేపర్లో చూసాను ప్రభుత్వం జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టిందని. ఇన్నాళ్లకి ఆ చెర నుండి బయటపడ్డావు. చాలా సంతోషంగా ఉందిరా" అంటూ దగ్గరకు వచ్చి ఆప్యాయంగా కౌగలించుకున్నాడు కోటేశ్వరరావు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పంట కాలువ మీద వంతెన దాటారు. పదడుగులు వేసి ఎడమవైపు రంగులతో మెరుస్తున్న బిల్డింగ్‌వైపు వింతగా చూసాడు సుబ్బన్న.

"అది రాయుడుగారి ఇల్లే. పెంకులు తీసి స్లాబ్ వేసారు. ఆ తరువాత ఫస్ట్‌ఫ్లోరు వేసారు. దాదాపు ఆరు సంవత్సరాలు అయిందనుకుంటా. నువ్వు జైలుకెళ్లిన సంవత్సరం తరువాత రాయుడుగారు హైదరాబాద్ వెళ్లిపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి బాగా సంపాదించాడు. వచ్చే నెల మూడవ తేదీ రాయుడుగారి మనవరాలి వివాహం. అందుకే బిల్డింగ్‌కి రంగులు వేయించారు. పెళ్లికొడుకు ఎవరో తెలుసా? భూషయ్య మనవడు" అన్న కోటేశ్వరరావు మాటలకి తెల్లబోయి చూసాడు సుబ్బన్న.

"పందెం కోసం కోడిపుంజులను సాకినట్టు మనల్ని పోషించి వాళ్ల పంతాలు, పౌరుషాల కోసం సాగే ఆటలో మనల్ని తోసేసి పైకాడ నుండి వినోదం చూస్తుంటారు. పెద్దోళ్ల తగాదాలకి బలయ్యేది పేదవాళ్లేరా. ఉన్నోళ్ల మధ్య వచ్చే గొడవలకి చితికిపోయేది మనబోటి చిన్నోళ్ల బతుకులేరా?" సుబ్బన్న కళ్లల్లోకి బాధగా చూస్తూ అన్నాడు కోటేశ్వరరావు.


రెండు నిముషాలు ఆ బిల్డింగ్‌వైపు తదేకంగా చూసి నీరసంగా అడుగులు వేసాడు సుబ్బన్న. గొల్లగూడెం దాటి కుడివైపు తిరిగి పది అడుగులు వేసి ఆగిపోయాడు సుబ్బన్న. ఎదురుగా చింత చెట్టు, దానికవతల మొండి గోడలు మాత్రమే మిగిలిన ఇల్లు. తలుపు, కిటికీలు ఉండాల్సిన చోట పెద్ద ఖాళీలు. గోడ వారగా నల్ల పంది పడుకుని వుంది. దాని పిల్లలు పాలకై దాని మీదకు ఎక్కి గొడవ చేస్తున్నాయి.

చిన్నప్పుడు చింత చెట్టెక్కి ఆటలాడిన రోజులు, కనుమ పండుగరోజు తల్లి కోడిని పట్టుకొమ్మని చెప్పినప్పుడు, ఆ కోడి తనని ఇంటి చుట్టూ పరుగుపెట్టించిన క్షణాలు, పదేళ్ల వయసులో రాయుడుగారి పని ఎగ్గొట్టి పట్నంలో మ్యాట్నీ షో చూసి రావడానికి వెళ్లినప్పుడు తన తండ్రి చింత చెట్టుకు కట్టేసి చింత బరికెతో చావబాదిన సంఘటన సుబ్బన్న గత జ్ఞాపకాలు అతని మనసును చుట్టు ముట్టాయి. భుజంమీద చల్లటి స్పర్శతో సుబ్బన్న వర్తమానంలోకి వచ్చి చెంపలమీదుగా జారుతున్న కన్నీళ్లు తుడుచుకున్నాడు.

సుబ్బన్న తడి కళ్లల్లోకి చూస్తూ "కాలం మహా విచిత్రమైనదిరా సుబ్బన్నా... ఏ టైంలో ఎవ్వడి జీవితంలో ఎలా ఆడుకుంటుందో తెలియదు" అంటూ మెల్లగా ముందుకు తీసుకువెళ్లాడు.

నాలుగిళ్ల తరువాత తన ఇంటి ముందు ఆగి గోడవారనున్న నులక మంచం తీసిన కోటేశ్వరరావు దానిని గుమ్మానికి ఎదురుగా వేస్తూ అన్నాడు "ఈ పూటకి మా ఇంట్లో ముద్ద తిని కునుకు తీయి. రేపటి సంగతి తెల్లారి ఆలోచిద్దాం"

★



## వెంట్రుకలు నిక్కపొడుచుకునే ఫీట్

ఇంగ్లాండులోని లెస్టర్ షైర్లో సెటిలయిన భారతీయుడు 59 ఏళ్ళ మంజిత్ సింగ్ ఇటీవల ఐదవ గిన్నెస్ వరల్డ్ రికార్ట్స్ డే రోజున లండన్‌లో ఏడు టన్నుల బరువైన డబుల్ డెక్కర్ బస్సును తన జుట్టుకు తాడుతో కట్టుకుని 21.2 మీటర్ల దూరానికి లాగి ఒక వరల్డ్ రికార్డుని స్థాపించాడట. దీని కోసం అతనేమీ స్పెషల్ ట్రయినింగ్ తీసుకోకపోవడం గమనార్హం.

-తటవర్తి

